TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 210 | మంగళవారం 19 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## ఆరెంజ్ అలర్ట్..



**ఢిల్లీ** : దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యంతో పాటు పొగమంచు నానాటికీ పడిపోతూ పరిస్థితి దిగజారుతోంది. సోమవారం ఉదయం గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 481కి చేరిందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. దీంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. పొగమంచు పూర్తిగా కమ్మేయడంతో 150 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. ఆదివారం రాత్రి 457గా నమోదైన వాయు నాణ్యతా సూచీ.. ఆ తర్వాత మరింత దిగజారింది. ఈ ఉదయం 7 గంటలకు 481కి చేరడంతో అధికారులు 'సివియర్ ప్లస్' కేటగిరీగా పేర్కొన్నారు. మరోవైపు పొగమంచు ఎఫెక్ట్‌తో విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ఆయా విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. కష్టమర్లు తమ ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని, ఎప్పటికప్పుడు ఫ్లైట్ స్టేటస్ చెక్ చేసుకోవాలని ఇండిగో పోస్ట్ చేసింది. కాలుష్యం కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ)- 4' కింద మరిన్ని నిబంధనలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఢిల్లీలోకి ట్రక్కుల(నిత్యావసర వస్తువులు, సర్వీసులు అందించే



ట్రక్కులు మినహా)కు ప్రవేశాన్ని నిలిపివేశారు. ఎల్‌ఎన్‌జీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్, బీఎస్-4 డీజిల్ ట్రక్కులనే అనుమతించనున్నట్లు తెలిపింది. అటు 10, 12 తరగతులు మినహా మిగతా తరగతుల వారందరికీ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించను న్నారు. ఆఫీసులను 50శాతం సామర్థ్యంతో నడుపుతున్నారు.





## మాకు చెప్పకుండా నిబంధనలు సడలించొద్దు



**ఢిల్లీ** : ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరడంపై సుప్రీంకోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని నిలదీసింది. దేశ రాజధానిలో గాలి నాణ్యతను పెంచేలా నిబంధనలు అమల్లోకి తీసుకురావాలని దాఖలైన పిటిషన్‌పై నేడు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌లతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. "ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300 దాటే వరకు మనం ఎందుకు ఎదురుచూడాలి?" అని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ సమయంలో తమకు చెప్పకుండా జీఆర్‌పీఏ-4 (గ్రాండ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్)లో ఎటువంటి సడలింపులూ ఇవ్వొద్దని ఢిల్లీ సర్కారుకు తెలిపింది. ఏక్యూఐ 400 స్థాయి కంటే దిగువకు చేరినా.. స్టేజ్ 4 నిబంధనల అమలు ఆపొద్దని చెప్పింది. ఈ సీజన్‌లో తొలిసారి ఢిల్లీలో వాయుకాలుష్యం అతి తీవ్రస్థాయి (సివియర్ ప్లస్)కి చేరింది. దీంతో ప్రభుత్వం జీఆర్‌పీఏ-4 అమల్లోకి తీసుకురావాల్సి వచ్చింది. ది సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ డేటా, ఏక్యూఐ సూచీ ప్రకారం నగరంలోని 481 స్థాయి దాటి పోయింది. 35 కేంద్రాల్లో చాలాచోట్ల 400 కంటే అధికంగా నమోదైంది. ద్వారకాలో ఏకంగా 499 నమోదైంది. సోమవారం ఉదయం కమ్ముకున్న పొగమంచుతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. గాలిలో ప్రాణాంతాక కాలుష్య కారకాల స్థాయిని కొలిచే పీఎం 2.5 సూచీ అత్యధిక స్థాయికి చేరిందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరేవరకు కేంద్ర ప్రభుత్వం అచేతనం గా ఉందని.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలమైందని సీఎం ఆతిశీ ఆరోపించారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యవసాయ వ్యర్థాలు దహనం చేస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాజధాని నగరంలో ప్రజలు ఊపిరి తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉత్తర భారతదేశంలో ఇతర నగరాల్లో పరిస్థితి దారుణంగా మారినా.. కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఢిల్లీలో పరిస్థితి అదుపు చేయడానికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలపై గత వారం సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది.

## ర్యాగింగ్ భూతానికి వైద్య విద్యార్థి బలి

**తెలుగు న్యూస్ టైమ్స్**: ఓ వైద్య విద్యార్థిని ర్యాగింగ్ భూతం పొట్టన బెట్టుకుంది. మొదటి సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థిని సీనియర్లు మూడు గంటల పాటు నిలబెట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. అనం తరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుజరాత్‌లోని జీఎంఈఆర్‌ఎస్ మెడికల్ కళాశాలలో ఈ ఘటన జరిగినట్లు జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. ఈ ఏడాది గుజరాత్ లోని ధారపుర్ పాటన్‌కు చెందిన వైద్య కళాశాలలో అనిల్ మెథానియా చేరారు. ఈ క్రమంలో పరిచయం పేరిట హాస్టల్‌లో రెండో సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్లపై ర్యాగింగ్ చేశారు. ఇందులో భాగంగా జూనియర్లు మూడు గంటల పాటు నిల్చోవాల్సి వచ్చింది. దాంతో అనిల్ కిందపడిపోయి, అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. తర్వాత వెంటనే అతడిని ఆసుపత్రికి తరలిం చారు. అక్కడే పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. సీనియర్లు బలవంతంగా నిల్చోబెట్టిన విషయాన్ని వెల్లడిం చాడు. అనంతరం చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. కాలేజీకి 150 కి.మీ. దూరంలో అనిల్ కుటుంబం నివసిస్తోంది. ఈ ఘటనపై మృతుడి బంధువు మాట్లాడుతూ.."అనిల్ స్పృహతప్పి పడిపోయాడని, ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నాడని మాకు కళాశాల నుంచి ఫోన్ వచ్చింది. ఇక్కడికి వచ్చిన తర్వాతే ర్యాగింగ్ విషయం తెలిసిం ది. మాకు న్యాయం కావాలి" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్ అనారోగ్యం గురించి తెలియగానే వెంటనే ఆసుపత్రిలో చేర్పించామని కాలేజ్ డీన్ హార్దిక్ షా మీడియాకు తెలిపారు. దీనిపై పోలీసు లకు సమాచారం ఇచ్చామని చెప్పారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడవుతాయని తెలిపారు.

## ఆర్థిక మంత్రి ఒకలా.. సివిల్ సప్లై మంత్రి మరోలా?



**అమరావతి:** ఎన్నికల హామీల అమలు విషయంలో.. చంద్రబాబు ప్రభుత్వం ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం శాసన మండలిలో చర్చ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారాయన. "దీపం-2 పథకాన్ని తప్పు దోవ పట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఈ పథకానికి బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఎన్నికలకు ముందు ఈ పథకంపై విపరీతమైన హామీలిచ్చారు. ఎన్నికలయ్యాక అధికారంలో వచ్చి ఇప్పుడు మెలిక పెడుతున్నారు. ఆర్థిక మంత్రి ఒకలా.. సివిల్ సప్లై మంత్రి మరోలా దీపం2 గురించి మాట్లాడు తున్నారు. ప్రజలను మభ్య పెట్టి అధికారంలో వచ్చింది. ఇప్పుడు నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలు వెంటనే అమలు చేయాలి.

చేతిలో అధికారం ఉందని విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోతామంటే కుదరదు. మా ప్రభుత్వ హయాంలో కూడా డిస్కంలకు సబ్సిడీ ఇచ్చాం. తల్లికి వందనం 18 వేలు ఇస్తామన్నారు? ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదు? అని బొత్స ప్రశ్నించారు.

## సూపర్ సిక్స్ కాదు.. సూపర్ బాదుడు

**తణుకు:** ఏపీ సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసి సూపర్ బాదుడు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. ఒకపక్క పెరిగిన పేదలు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు మాత్రం నిర్మల సీతారామన్‌ను ఒక పర్సెంట్ జీఎస్టీ పెంచుకోవటానికి అనుమతి అడుగుతున్నారుని అన్నారు. మాజీ మంత్రి కారుమూరి ఆదివారం తణుకు వైయస్ఆర్‌సీపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తాం పేదవారిని లక్షాధికారిని చేస్తామని చంద్రబాబు అబద్దాలు చెప్పాడు. ఆనాడు బాదుడే బాదుడు అని తిరిగిన చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నదేంటి?. సూపర్ సిక్స్ హామీలను చంద్రబాబు గాలికి వదిలేశారు.. ప్రజలకు సూపర్ బాదుడు అమలు చేస్తున్నారు. నాణ్యమైన కరెంట్ ఇస్తామని కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి సూపర్ బాదుడు బాదుతున్నారు. ఆనాడు లోకేష్ రైతులను ఉద్దేశించి స్మార్ట్ మీటర్లు ఎవరూ పెట్టుకోవద్దని, అవి బిగిస్తే బద్దలు కొట్టాలని చెప్పాడు. ఇప్పుడు కేంద్రంతో కుమ్మక్కై స్మార్టుగా స్మార్టు మీటర్లు బిగించేస్తున్నారు. ఇది రైతులను మోసం చేసినట్లు కాదా?. వందల కోట్లు చందాలు వసూలు చేసి అగ్గిపెట్టె, కొవ్వొత్తులకి అయిపోయాయని మోసం చేశారు. అన్ని నిత్యవసర ధరలను ఇష్టానుసారం పెంచేశారు.

ఒక్కసారి గమనిస్తే నూనె దగ్గర నుండి పప్పులు, ఉప్పులు, కూరగాయలు అన్నీ కూడా దారుణంగా పెంచేశారు. ఇప్పటికీ వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న ధరలను ప్రజలకు ఒక్కసారి గమనించుకోండి. ఒక పక్క పేద ప్రజలు గగ్గోలు పెడుతుంటే చంద్రబాబు మాత్రం ఒక పర్సెంట్ జీఎస్టీ పెంచుకోవడానికి ఆర్థిక మంత్రిని అనుమతి అడుగుతున్నారు. అన్నీ అబద్దాలు చెప్పి ప్రజలను మోసం చేసి వచ్చారు కూటమి నేతలు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పే మీరు ఎక్కడ సంపద సృష్టించారు. ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై నిందలు మోపారు. అసెంబ్లీ సాక్షిగా అన్ని నిజాలు బయటకు వస్తున్నాయి. మరి ఇప్పుడేం సమాధానం చెబుతారు' అని ప్రశ్నించారు.

## ఉడుత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు


**నెల్లూరు:** పాత కేసులు తోడి నన్ను భయపెట్టాలని చూస్తున్నారు.. ఉడుత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి హెచ్చరించారు. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి పనుల్లో అవినీతి కట్టలు తెంచుకుని ప్రవహిస్తుందని ఆరోపించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారు రిటైర్ అయినా సరే జైలుకు వెళ్లక తప్పదని వార్నింగ్ ఇచ్చారు. మాజీ మంత్రి కాకాణి సోమవారం మీడియాతో మాట్లాడుతూ..'సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెట్టడం కరెక్ట్ కాదు. కూటమి ప్రభుత్వం, పోలీసుల తీరును ఖండిస్తున్నాం. ఇరిగేషన్‌లో అవినీతి ఆరోపణలు చేస్తున్న సోమిరెడ్డి నోరు డ్రైనేజీ కంటే అధ్వాన్నంగా ఉంది. తూ.తూ మంత్రంగా పనులు ముగించి నీళ్ళు వదిలితే ఆ పనుల్లో నాణ్యత ఎలా ఉంటుంది. టెండర్ల కంటే ముందే పనులు ముగించిన అవినీతి ఘనత సోమిరెడ్డిది. పూడికతీత పనులు ఎంత నాణ్యతగా ఉన్నాయో ఇవే సాక్ష్యాలు అంటూ ఫోటో ప్రూఫ్ మీడియాకు చూపించారు.

నవంబర్ ఏడో తేదీన నీళ్ళు వదిలిన ఘనతను దినపత్రికలే సాక్షిగా చెబుతున్నాయి. నీకు అనుకూలంగా వున్న కొద్ది మంది రైతుల దగ్గర పనులు జరగలేదని చెప్పించడం కాదు. మొత్తం కనుపూరు కాలువ మీద 30 కోట్ల అవినీతి జరిగింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారు రిటైర్ అయినా సరే జైలుకు వెళ్లక తప్పదు. సోమిరెడ్డి చేస్తున్న పనుల్లో అవినీతి కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది. విచారణలో అవకతవకలు జరిగినట్లు తేలితే దాని మీద మళ్ళీ విచారణ చేయిస్తాం.

## జిల్లాల స్థూల ఉత్పత్తిలో విశాఖ టాప్

**అమరావతి:** రాష్ట్రంలో జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తిలో విశాఖపట్నం జిల్లా అగ్రస్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో ఎన్టీఆర్ జిల్లా, మూడో స్థానంలో కృష్ణా జిల్లా నిలిచాయి. చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఉంది. రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 13 నుంచి 26కు పెంచాక తొలిసారిగా జిల్లాలవారీ స్థూల ఉత్పత్తిని లెక్కించారు. ఈ క్రమంలో 2022-23 ఆర్థిక సంవత్స రానికి ప్రస్తుత ధరల ప్రకారం జిల్లాల వారీగా స్థూల ఉత్పత్తిని డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ తాజాగా వెల్లడించింది. మొత్తం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో విశాఖపట్నం జిల్లా వాటా 9.15 శాతం ఉండగా ఎన్టీఆర్ జిల్లా వాటా 5.65 శాతం, కృష్ణా జిల్లా వాటా 5.24 శాతం ఉంది. ఇక చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా 1.16 శాతం వాటాతో నిలిచింది. కాగా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏలూరు జిల్లా 9.87 శాతం వాటాతో మొదటి ర్యాంకులో ఉండగా కృష్ణా జిల్లా 7.56 శాతంతో రెండో ర్యాంకులో నిలిచింది. పశ్చిమ గోదావరి జిల్లా 5.32 శాతం వాటాతో మూడో ర్యాంకు దక్కించుకుంది. పారిశ్రామిక రంగంలో విశాఖపట్నం జిల్లా 18.82 శాతం వాటాతో మొదటి ర్యాంకులో నిలవగా తిరుపతి 7.78 శాతం వాటాతో రెండో ర్యాంకులో నిలిచింది.

# సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ



**అమరావతి:** సోషల్ మీడియా యాక్టివిస్టులపై చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా అమానుష కాండను కొనసాగిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడమే వారు చేసిన నేరం. వారిపై అక్రమ కేసులు నమోదు చేయడమే కాకుండా ...వారిని అక్రమంగా నిర్బంధించి భౌతికంగా దాడులు చేస్తూ ...కసి తీరిన తరువాతే అరెస్ట్ చూపిస్తోంది. మానవ హక్కులను నిర్భీతిగా ఉల్లంఘిస్తూ ...రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ సాగిస్తున్న ఈ దమనకాండకు ప్రభుత్వ ముఖ్యనేతే ప్రధాన కుట్రదారు కాగా... కీలక పోలీసు అధికారులు పాత్రధారులు, పర్యవేక్షకులు.

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ రాక్షస క్రీడ కొనసాగుతోంది. అందులో ప్రధానంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇందులో బాగా ఆరితేరిపోయారు. అందరికన్నా ముందుండాలన్న తాపత్రయం వారిలో కనిపిస్తోంది. పౌరుల భావప్రకటనా స్వేచ్ఛను దారుణంగా కాలరాస్తున్న సర్కారు దమననీతిపై న్యాయపోరాటానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారు.

అంతేకాదు తమ విద్యుక్తధర్మాన్ని గాలికొదిలేసి ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లల్లా తలాడిస్తూ సోషల్ మీడియా యాక్టివిస్టులపై దమనకాండను కొనసాగిస్తున్న పోలీసు అధికారులపైనా ఎక్కడికక్కడ ప్రైవేటు కేసులు వేసేందుకు బాధిత కుటుంబాలు సిద్ధమవుతున్నాయి. వీరికి పలువురు మేధావులు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమకారులు, పలు పౌరసంఘాల నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. త్వరలోనే 'పచ్చ'పాత పోలీసు అధికారులందరూ న్యాయస్థానం ముందు దోషులుగా నిలబడడం తథ్యమని బాధిత కుటుంబాలు స్పష్టం చేస్తున్నాయి.

**అంతా ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే...** ఈ మొత్తం వ్యవహారం ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో కొనసాగుతోంది. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శాంతిభద్రతల విభాగాన్ని పర్యవేక్షించే ఉన్నతాధికారి ఈ వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. అంటే ఈ అమానుష కాండను కొనసాగించేందుకు ప్రభుత్వ పెద్దలు రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారని దీనినిబట్టి స్పష్టమవుతోంది. ప్రభుత్వ పెద్దలు టార్గెట్ చేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులను వారు సంతృప్తిచెందే స్థాయిలో భౌతికంగా హింసించారా లేదా అన్నది వీడియో కాల్ ద్వారా పర్యవేక్షిస్తుండటం ప్రభుత్వ కక్షకు పరాకాష్టగా నిలుస్తోంది. ఆ రాక్షసకాండ ఇలా సాగుతోంది...

**ఎన్ని కేసులు.. ఎక్కడికి తరలిస్తున్నారు? :** రాష్ట్రంలో సోషల్‌మీడియా యాక్టివిస్టులపై ప్రభుత్వం ఎడాపెడా అక్రమ కేసులు బనాయిస్తోంది. ఒక్కో యాక్టివిస్టుపై ఒకటికి మించిన కేసులు నమోదు చేయడమే కాకుండా... వేర్వేరు జిల్లాల్లో కేసులు నమోదు చేస్తోంది. వారిని పోలీసులు హఠాత్తుగా అదుపులోకి తీసుకుని తమతో పట్టుకుపోతున్నారు. ఏ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుందీ... ఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారన్న కనీస సమాచారాన్ని కూడా కుటుంబ సభ్యులకు చెప్పడం లేదు. దాంతో తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాకబు చేస్తే అసలు తాము ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదని అక్కడి పోలీసు అధికారులు చెబుతున్నారు.

**థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి కరడుగట్టిన నేరస్తులా? :**అక్రమంగా అదుపులోకి తీసుకున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను పోలీస్ స్టేషన్లు తిప్పుతూ చిత్రహింసలకు గురి చేస్తున్నారు. కరడుగట్టిన నేరస్తులపై ప్రయోగించినట్లు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ భౌతికంగా హింసిస్తున్నారు. తాము చెప్పినట్టుగా వాంగ్మూలం ఇవ్వాలని.. లేకపోతే మరిన్ని రోజులు చిత్రవధ తప్పదని హెచ్చరిస్తున్నారు.

**వీడియో కాల్ ద్వారా నిర్ధారణ :** సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించామని పోలీసులు మాటలతో చెబితే ఉన్నతాధికారులు సంతృప్తి చెందడం లేదు. పోలీసు అధికారులు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో శాంతిభద్రతల విభాగాన్ని పర్యవేక్షించే ఓ ఉన్నతాధికారికి వీడియో కాల్ చేసి మరీ చూపిస్తున్నారు. సోషల్ మీడియా యాక్టివిస్టులపై థర్డ్ డిగ్రీ తాము ఆశించినస్థాయిలో ప్రయోగించారా లేదా అన్నది ఆ ఉన్నతాధికారి వీడియో కాల్ ద్వారా పరిశీలిస్తారు. ఆయన సంతృప్తి చెందితే ఆ విషయాన్ని తన బిగ్ బాస్‌కు నివేదిస్తారు. ఆయన అనుమతి ఇచ్చిన తరువాతే... ఒకే ఇక చాలు... అరెస్ట్ చూపించండి అని ఆ ఉన్నతాధికారి జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు చెబుతారు.

**చిత్రహింసల తర్వాతే అరెస్ట్.. :** ఆ విధంగా ప్రభుత్వ పెద్దలు ఆదేశించినస్థాయిలో థర్డ్ డిగ్రీని ప్రయోగించారని నిర్ధారించుకున్న తరువాతే సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్ట్ చూపిస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మూడు రోజుల నుంచి వారం రోజులపాటు సాగుతోంది. కుట్రపూరిత, కక్ష పూరిత రాజకీయాలకు పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పోలీసు వ్యవస్థను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతగా దుర్వినియోగం చేయలేదని పోలీసు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. పోలీసులను గుండాల మాదిరిగా మార్చి రాజకీయ అరాచకం సాగిస్తుండటం విభ్రాంతికరమని మండిపడు తున్నారు. ఈ పరిణాములతో పోలీసు అధికారులు భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# ప్రభుత్వ వైఫల్యం వల్లే మహిళలు, చిన్నారులపై నేరాలు

**అమరావతి :** ప్రభుత్వం, పోలీసులు వైఫల్యం వలన రాష్ట్రంలో మహిళలు, చిన్నారుల పై నేరాలు జరుగుతున్నాయని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. ఏపీ శాసన మండలిలో శాంతి భద్రతలపై వాడీ వేడి చర్చ నడిచింది. తొలుత.. రాష్ట్రంలో అత్యాచార ఘటనలు పెరిగిపోవడంపై వరదు కళ్యాణి మాట్లాడారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలపై నేరాలు, వేధింపులు పెరిగాయి. రాష్ట్రంలో రోజుకు 59 నేరాలు మహిళలపై జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రతి గంట కి ఇద్దరు, ముగ్గురు మహిళలు పై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసులు వైఫల్యం వలన మహిళలు, చిన్నారుల పై నేరాలు జరుగుతున్నాయి. ముచుమర్రి లో 9 ఏళ్ల బాలిక పై అత్యాచారం చేసి చంపేస్తే ఈరోజు కి మృతదేహం దొరకలేదు. హిందూపురం లో అత్తా కోడళ్ల పై గ్యాంగ్ రేప్ చేశారు. ఏ ఆర్ పురంలో చిన్నారిని అత్యాచారం చేసి చంపేశారు. దిశ యాప్ ని కొనసాగిస్తున్నారా..? లేదా..?. దిశ పోలీసు స్టేషన్ల ను కొనసాగిస్తున్నారా లేదా?. మహిళల పై నేరాల పై నియంత్రణ కు ఏదైనా కొత్త వ్యవస్థ తెచ్చారా..? అని మండలిలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి కూటమి ప్రభుత్వానికి ప్రశ్నలు గుప్పించారు. దిశ యాప్, చట్టాన్ని నిర్వీర్యం చేయడంపై ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రభుత్వం నుంచి వివరణ కోరారు.

దీనిపై అనిత మాట్లాడుతూ.. అత్యాచార ఘటనను రాజకీయం చేయొద్దన్నారు. అలాగే.. మహిళల భద్రత పేరిట వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం దిశ చట్టం తెచ్చిందని, దిశ పోలీస్ స్టేషన్లు గతంలో ఏర్పాటు చేశారని.. తాము అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించామని ఆమె అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా విఫలం అయ్యిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పిన వ్యాఖ్యలను మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ గుర్తు చేశారు. ఐదు సంవత్సరాల వైయస్ఆర్‌సీపీ పాలనలో కంటే.. తమ హయాంలోని గత ఐదు నెలల కాలంలోనే క్రైమ్ రేటు విపరీతంగా తగ్గిందని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాంతి భద్రతల అంశంపై చర్చ సందర్భంగా.. వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీల ప్రశ్నలకు ఆమె వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆమె అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై వైయస్ఆర్‌సీపీ ఆందోళనకుదిగగా.. మరోవైపు చైర్మన్ సైతం ఆమె తీరును తప్పుబట్టారు.దఅసహనానికి లోనైన ఆమె.. దమ్ము, ధైర్యం అంటూ ఆమె తీవ్ర పదజాలంతో మాట్లాడారు.



## తమిళనాడుకు నిధుల కేటాయింపుపై సీఎం స్టాలిన్ వివరణ



**విల్లివాకం న్యూస్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధులను పంచుకోవడానికి రాజ్యాంగ చట్టం 280 ప్రకారం ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అధిక అధికారాలు కలిగిన ఫైనాన్స్ కమిషన్ 5 సంవత్సరాలకు ఒకసారి అన్ని రాష్ట్రాలను సందర్శించి తనిఖీ నిర్వహిస్తుంది. రాబోయే 5 సంవత్సరాలలో ఆర్థిక వృద్ధి మరియు పన్ను రాబడి ప్రణాళిక ఎలా ఉండాలి? ఫైనాన్స్ కమిటీ ప్రతి రాష్ట్రానికి వెళ్లి ఏయే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి అనే దానిపై వివిధ సమాచారం మరియు డేటాను సేకరిస్తుంది. దాని ఆధారంగా 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనా గారియా నేతృత్వంలోని 12 మంది సభ్యుల బృందం ప్రత్యేక విమానంలో ఆదివారం చెన్నైకి చేరుకుంది. ఈ కమిటీలోని 12 మంది సభ్యులు అజయ్ నారాయణన్ షా, అనిజార్జ్ మాథ్యూ, మనోజ్ పాండా, సమియా కండి ఘోష్, సెక్రటరీ రిత్విక్ పాండే, జాయింట్ సెక్రటరీ రాహుల్ జైన్ కూడా ఉన్నారు. గిండీలోని ఐటీసీ గ్రాండ్ చోలా హొటల్‌లో బస చేసిన వారిని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ స్వయంగా పరామర్శించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు దురైమురుగన్, కెఎన్ నెహ్రూ, పొన్ముడి, ఎవి వేలు, తంగం తెన్నరసు, ముఖ్య కార్యదర్శి మురుగానందం, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఉదయచంద్రన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తమిళనాడుకు తగిన నిధుల కేటాయింపుపై ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ వివరించారు. భారత రాజ్యాంగం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మరియు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు మరియు బాధ్యతల పంపిణీని అందిస్తుందన్నారు.

## ప్రపంచ తెలుగు సదస్సుకు శ్రీపురం యజ్ఞశేఖర్‌కు ఆహ్వానం



**విల్లివాకం న్యూస్:** ఖతార్ దేశ రాజధాని దోహా నగరంలో నవంబర్ 22, 23 వ తేదీలలో జరిగే 9 వ ప్రపంచ తెలుగు సదస్సుకు మద్రాసు క్రైస్తవ కళాశాల, తెలుగు శాఖాధ్యక్షులు డా. శ్రీపురం యజ్ఞశేఖర్ కు ఆహ్వానం అందింది. ఆంధ్ర కళావేదిక, ఖతార్ మరియు వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తమిళనాడు నుండి సదస్సులో పాల్గొంటున్న ఏకైక తెలుగు ఆచార్యులు శ్రీపురం యజ్ఞశేఖర్ కావడంతో పలువురు తెలుగు ప్రముఖులు ప్రశంసించి అభినందనలు తెలిపారు. "గురజాడ - మానవతావాదం" అనే అంశంపై యజ్ఞశేఖర్ ప్రసంగించనున్నారు.

## ఏఐఏడీఎంకేకు 'నో' చెప్పిన విజయ్..





**టీ నగర్ న్యూస్ :** అన్నాడీఎంకేతో తమిళనాడు వెట్రి కల గం పొత్తు పెట్టుకుంటుందన్న వార్తలు పూర్తిగా అవాస్తవం. ఇది నిరాధారమని తమిళనాడు విక్టరీ అసోసియేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు విక్టరీ లీగ్ మొదటి రాష్ట్ర సదస్సులో లీగ్ అధ్యక్షుడు తన ప్రసంగంలో సూత్రాలు, విధాన శత్రువు, రాజకీయ శత్రువు, ఎన్నికల స్థితిగతుల గురించి స్పష్టంగా వివరించారు. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వ ఏర్పాటుకు అన్ని వ్యూహాలు రచించి ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమిళనాడు విక్టరీ లీగ్ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పాలన మార్పునకు ప్రధాన శక్తిగా ప్రజల్లో తమిళనాట విజయ కజగం ఎదుగుదలను మార్చాలనే ఉద్దేశంతో, ప్రజల్లో తమిళనాడు విజయ కజగం ఎదుగుదలను మార్చాలనే ఉద్దేశంతో మేజర్ తమిళ దినపత్రిక ప్రచురించిన సమాచారం పూర్తిగా అవాస్తవమని, తమిళనాడు విక్టరీ కజగంను ఏఐఏడీఎంకేతో కలుపుతూ నిన్నటి వార్తలను విడుదల చేసింది. ఈ వార్త పూర్తిగా తప్పు. కొంత మంది తప్పుడు అభిప్రాయాల ఆధారంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా రాజకీయ విమర్శకుల ముసుగులో ప్రచారం చేస్తున్న ఇలాంటి అవాస్తవ తప్పుడు వార్తలను ఉపేక్షించమని తమిళనాడు ప్రజలకు గుర్తు చేస్తున్నాను. తమిళనాడు వెట్రి కజగం రాజకీయ మార్గం పూర్తిగా తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసమే. తమిళనాడు విక్టరీ లీగ్ యొక్క లక్ష్యం, పార్టీ అధినేత వ్యక్తీకరించిన స్థానం ఆధారంగా దేశ ప్రజల సహకారంతో మెజారిటీ బలంతో గెలుపొందడం ద్వారా తమిళనాడు ప్రజల సంక్షేమం కోసం సామరస్యాన్ని నెలకొల్పడం. కావున, తమిళనాడు వెట్రి కజగం గురించిన అవాస్తవ వ్యాఖ్యలను ప్రజలను గందరగోళపరిచే వార్తగా ప్రచురించడం మానుకోవాలని నేను మీడియాను అభ్యర్థిస్తున్నాను. ఈ నోటీసు కార్పొరేషన్ అధ్యక్షుని ఆమోదంతో ప్రచురించబడింది.

## ఎ.డి.ఎం.కెలో దలవాయి సుందరం తిరిగి నియామకం



**విల్లివాకం న్యూస్:** ఎ.డి.ఎం.కె. ఆర్గనైజింగ్ సెక్రటరీగా, కన్యాకుమారి ఈస్ట్ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా దలవాయి సుందరంను తిరిగి నియమించారు. దీనిని ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రచురించిన ప్రకటనలో ఇలా పేర్కొంది. మాజీ మంత్రి, కన్యాకుమారి నియోజకవర్గ శాసనసభ్యుడు దలవాయి సుందరం కన్యాకుమారిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న కారణంగా 8.10.2024న తాత్కాలికంగా అతని బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. దలవాయి సుందరం ఈ కార్యక్రమం లో పాల్గొనడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ నాయకత్వానికి వివరణ ఇచ్చారు. ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు కన్యాకుమారి తూర్పు జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. అసోసియేషన్ సోదర సోదరీమణులు ఆయనకు పూర్తి సహకారం అందించవలసిందిగా కోరుతున్నాను.

## తిరుపూర్‌లో పాఠశాలకు బాంబు బెదిరింపు - విద్యార్థుల ఆందోళన



**అన్నా నగర్ న్యూస్ :** తిరుపూర్‌లోని రాకియా పాళయం ప్రాంతంలో ఓ ప్రైవేట్ పాఠశాల నడుస్తోంది. ఇక్కడ 1500 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వారాంతపు సెలవుల అనంతరం యథావిధిగా ఈ ఉదయం విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాల ప్రారంభమైన కొద్దిసేపటికే పాఠశాల కార్యాలయ ఈ-మెయిల్‌కు ఈ-మెయిల్ ద్వారా సంక్షిప్త సందేశం వచ్చింది. సమాచారం అందుకున్న నల్లూరు అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం విద్యార్థులను, ఉపాధ్యాయులను సురక్షితంగా పాఠశాల మైదానానికి తీసుకొచ్చి కూర్చోబెట్టారు. ఘటనా స్థలానికి బాంబు నిపుణులను పిలిపించి పాఠశాల తరగతి గదులు, కార్యాలయాలు, టాయిలెట్లలో సోదాలు చేశారు. పాఠశాల విద్యార్థులు బుక్ బ్యాగులుఅయితే పాఠశాలకు బాంబు బెదిరింపు ఘటనతో ఆ ప్రాంతంలో కలకలం రేగింది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట గుమిగూడారు. తమ పిల్లలను క్షేమంగా ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు సెలవు కూడా ఇచ్చారు.

## వి.వు.చిదంబరనార్‌కు స్టాలిన్ నివాళి



**విల్లివాకం న్యూస్ :** ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తన సోషల్ మీడియాలో ఇలా పోస్ట్ చేశారు. తమిళ భక్తి, నిస్వార్థం, విముక్తి దాహంతో చరిత్రలోనూ, తమిళ ప్రజల ఆత్మల్లోనూ చెరగని ముద్రగా నిలిచిన వి.వు.చిదంబరనార్ 88వ జయంతి సందర్భంగా ఆ వీర ధీరుని కొనియాడదాం! ఆయన త్యాగపూరిత జీవితాన్ని పూజిద్దాం! అని పోస్ట్ చేశారు.

## ఏనుగు తొక్కడంతో ఇద్దరు మృతి



**విల్లివాకం న్యూస్:** తిరుచెందూర్ సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఏనుగు మావటితో సహా ఇద్దరిని తొక్కి చంపిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఏనుగుకు పండు ఇవ్వడానికి వచ్చిన మావటి ఉదయ మరియు అతని సహచరుడిని ఏనుగు తొక్కి చంపినట్లు సమాచారం.



# శ్రీవాణి ట్రస్టు రద్దు.. రెండు మూడు గంటల్లో దర్శనం



**తిరుమల:** సర్వదర్శనానికి వచ్చే భక్తులకు 2 నుంచి 3 గంటల్లోగా దర్శన భాగ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తితిదే నిర్ణయించింది. తితిదేలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను ప్రభుత్వానికి అప్పగించనుంది. ఈ మేరకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీవాణి ట్రస్టు రద్దు చేయాలని నిర్ణయించారు. బీఆర్ నాయుడు తన తొలి సమావేశంలోనే సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం 3:30 గంటలకు వరకు సుదీర్ఘంగా కొనసాగింది. అజెండాలోని 80 అంశాలను పరిశీలించి సభ్యులు నిర్ణయాలు తీసుకున్నారు. గత ఐదేళ్లలో పాలకమండలి తీసుకున్న నిర్ణయాలను పునఃసమీక్షించి కొన్నింటిని రద్దు చేశారు. సమావేశం వివరాలను బీఆర్ నాయుడు మీడియాకు వెల్లడించారు. శ్రీనివాస సేతు పైవంతెనకు గరుడ వారధిగా నామకరణం చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. “తిరుమల డంపింగ్ యార్డులోని చెత్తను 3 నెలల్లో తొలగిస్తాం. తిరుమలలో రాజకీయాలు మాట్లాడకుండా చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు బ్యాంకుల్లో నగదును ప్రభుత్వ బ్యాంకుల్లోకి బదలాయిస్తాం. శారదాపీఠం లీజును రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. పర్యాటకం ద్వారా దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేస్తున్నాం. నూతనంగా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు చేస్తున్నాం. అలిపిరిలో టూరిజం కార్పోరేషన్ ద్వారా దేవలోక్‌కు కేటాయించిన 20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకుని తితిదేకి ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరతాం. తిరుపతి ప్రజలకు ప్రతినెల మొదటి మంగళవారం దర్శనానికి అవకాశం కల్పిస్తాం” అని బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

# తిరుమల నిత్య అన్నప్రసాదం మెనులో అదనంగా మరో పదార్థం




**తిరుపతి న్యూస్ :** ఆపద మొక్కులవాడు, కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిపై ఎంతో నమ్మకంతో తిరుమలకు వచ్చే భక్తులకు స్వామివారి సేవలు మరింత చేరువ చేసేందుకు టీటీడీ నూతన పాలక మండలి కీలక నిర్ణయం తీసుకుంది. టీటీడీ నూతన ధర్మకర్తల మండలి సమావేశం ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి తీసుకున్న ముఖ్య నిర్ణయాలను ఛైర్మన్ మీడియాకు వివరించారు. భక్తులకు నిత్య అన్న ప్రసాదం మెనూలో అదనంగా మరొక పదార్థాన్ని చేర్చాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. క్యూ లైన్లలో భక్తులు ఎక్కువసేపు భక్తులు వేచి ఉండకుండా ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ ఉపయోగించి 2, 3 గంటల్లోనే దర్శనమయ్యేలా ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించేందుకు అవకాశముంటుందని తెలిపారు.

**ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం :** బ్రహ్మోత్సవాలలో విశేష సేవలు అందించిన ఉద్యోగులకు గత సంవత్సరం ఇచ్చిన బ్రహ్మోత్సవ బహుమానాన్ని 10 శాతం పెంచాలని టీటీడీ నిర్ణయించిందని ఛైర్మన్ వెల్లడించారు. రెగ్యులర్ ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535, బ్రహ్మోత్సవ బహుమానం కింద అందించనున్నట్లు ప్రకటించారు. శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణకు, అన్న ప్రసాద కేంద్రం ఆధునీకరణకు టీవీఎస్ సంస్థతో ఎంఓయూ చేసుకోనున్నామని, ఈ పనులను టీవీఎస్ సంస్థ ఉచితంగా చేయనుందని ఆయన అన్నారు.

# ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం

**అమరావతి:** ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ మున్సిపల్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు-2024 తదితర ఏడు కీలక బిల్లులకు ఏపీ శాసనసభ ఆమోదం తెలిపింది. ఎంతమంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించేలా నిబంధనలు మారుస్తూ తీసుకొచ్చిన బిల్లు సభ ఆమోదం పొందింది. ఎన్టీఆర్ హెల్ వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024 బిల్లులను శాసనసభ ఆమోదించింది. వీటితోపాటు



ఏపీ సహకార సంఘం సవరణ బిల్లు-2024నూ శాసనసభ ఆమోదించింది. అనంతరం స్పీకర్ అయ్యన్న పాత్రుడు శాసనసభను మంగళవారానికి వాయిదా వేశారు.

## కనకదాస బోధనలు నేటికీ అనుసరణీయం

**అమరావతి:** సంఘ సంస్కర్త, కవి, గాయకుడు, కృష్ణతత్వ భక్తుడు గురు కనకదాస జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ‘ఎక్స్’ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మార్పు తీసుకొచ్చేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కర్ణాటకలో జన్మించిన గురు కనకదాస రాయలసీమలోనూ కుల వ్యవస్థ, అసమానతలపై చైతన్యం తీసుకొచ్చిన సామాజిక తత్వవేత్త అని కొనియాడారు. బీసీలు, వారి సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ, వారి ఉన్నతి కోసం ప్రతి ఒక్కరూ పని చేయాల్సిన అవసరం గుర్తు చేసిన మహనీయుడు కనకదాస.. అని వెల్లడించారు. భక్తి మార్గంలో ఆయన చేసిన బోధనలు నేటికీ అనుసరణీయమన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో ఆయన ఎన్నో ఏళ్ల కిందట చేసిన బోధనలు ఈనాటి సమాజానికి కూడా మార్గదర్శనం చేస్తున్నాయంటే ఆ మహనీయుడి దార్శనికతను మనం అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. గురు కనకదాస బోధనలు సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించేందుకు ఉపకరిస్తాయని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానన్నారు.








# భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు

**ఢిల్లీ :** భారతదేశపు తొలి హైడ్రోజన్ ట్రైన్ పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. డిసెంబర్ నెలాఖరులో ట్రయల్ రన్ జరుగబోతున్నది. ఇక వచ్చే ఏడాది అందుబాటులోకి రాబోతున్నది. తొలిసారిగా ఈ రైలు జింద్ - సోనిపట్ మార్గంలో నడువనున్నది. ఢిల్లీలో డివిజన్‌లోని 89 కిలోమీటర్ల మార్గంలో రాకపోకలు సాగిస్తుంది. 2030 నాటికి భారత్‌లో కార్బన ఉద్గారాలను తగ్గించాలని కేంద్రం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం భారతీయ రైల్వేలో ఎలక్ట్రిక్, డీజిల్‌తో రైళ్లు నడుస్తున్నది. ప్రస్తుతం కొత్తగా హైడ్రోజన్‌తో రైలును నడిపించేందుకు ప్రయత్నిస్తున్నది. భారతీయ రైల్వేశాఖ భారీ ప్రణాళికలో భాగంగా నేషనల్ హెరిటేజ్, కొండ ప్రాంతాల్లో 35 హైడ్రోజన్ రైళ్లను నడపాలని భావిస్తున్నది.

ఈ ప్రాజెక్టుకు హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్‌గా పేరు పెట్టింది. హైడ్రోజన్ రైళ్లు పర్యావరణానికి మేలు చేస్తాయి. వాటితో కాలుష్యం ఏమాత్రం ఉండదు. 2030 నాటికి రైల్వేలు తమను తాము నెట్ జీరో కార్బన్ ఎమిటర్‌గా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఇందులో హైడ్రోజన్ రైళ్ల లక్ష్య సాధనలో కీలకంగా మారనున్నాయి. ఇందుకోసం రైల్వేశాఖ మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఈ రైళ్లలో హైడ్రోజన్‌తో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. హెచ్‌ఓజీ సాంకేతికతో రైలుకు అవసరమైన విద్యుత్ అంతా లోకోమోటివ్‌లోనే ఉత్పత్తి కానున్నది. అదే సమయంలో ఆ మార్గాల్లో రైల్వేశాఖ చెట్లను నాటడంతో పాటు రైల్వేస్టేషన్లలో సోలార్ ప్లాట్లను సైతం ఏర్పాటు చేస్తున్నది. హైడ్రోజన్ రైలు ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ భారీగా ఖర్చు చేస్తోంది.ఈ ఏడాది బడ్జెట్‌లో 35 హైడ్రోజన్ రైళ్లకు రూ.2800 కోట్లు కేటాయించింది. అలాగే, హెరిటేజ్ మార్గాల్లో హైడ్రోజన్ సంబంధిత మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేకంగా రూ.600 కోట్లు ఇచ్చింది. అంతేకాకుండా డీజిల్‌తో నడిచే డెము రైలును.. హైడ్రోజన్‌తో నడిపే ప్రాజెక్ట్‌ను కూడా రైల్వే ప్రారంభించింది. ఇందుకోసం రూ.111.83 కోట్ల కాంట్రాక్టు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కింద రైలులో హైడ్రోజన్‌తో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఏర్పాట్లు చేస్తారు. గ్రౌండ్ లెవెల్‌లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. ప్రస్తుతం హైడ్రోజన్ రైలు ప్రాజెక్ట్ భారతీయ రైల్వేలకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ ప్రాజెక్ట్ పర్యావరణానికి ప్రయోజనకరంగా ఉండనున్నది.